# త్రైలోక్యగీత

# పంచమ అధ్యాయము
# బ్రహ్మాది విచార యోగము

## త్రైలోక్యా ఉవాచ:

**కిం బ్రహ్మ? కిం పరబ్రహ్మ?, కోఽవతారః ? క ఈశ్వరః? |**
**కో జీవః? కిం జగత్?, కో వా, మోక్షః ? కైవల్య మత్ర కిమ్? ||5.1||**

[కుమారి త్రైలోక్య ఇలా అడిగింది:
బ్రహ్మము అనగా నేమి? పరబ్రహ్మము అనగానేమి? అవతారము అనగానేమి? ఈశ్వరుడు ఎవరు? ఎవరు జీవుడు? ఈ ప్రపంచము ఏమిటి? ఇక్కడ ముక్తి అనగా ఏమిటి? కైవల్యము అనగానేమి?]

## శ్రీ శ్రీ శ్రీ దత్త స్వామీ ఉవాచ:

**హే! త్రైలోక్యే! సద్విలోక్యే! ప్రీతో జిజ్ఞాసయాఽస్మి తే |**
**వివృణోమి సమం పృష్టం, పరమ శ్రద్ధయా శృణు ||5.2||**

[శ్రీ దత్త స్వామి అన్నారు:
ఓ త్రైలోక్య! పరమ సత్యమును తెలుసుకోవడమే నీ లక్ష్యము. నీ ఆధ్యాత్మిక జిజ్ఞాస చూసి నేను ఆనందించాను. నీవు అడిగిన వన్నీ నేను వివరిస్తాను. అత్యంత శ్రద్ధతో వినుమా!.]

**కార్యహేతు లతా మూలం, అహేతు స్స్యాత్ యదంతిమ్ |**
**ఇదం నాంతం పరాస్తర్కాత్, దృశ్యంతే చ విభూతయః ||5.3||**

[ఈ జగత్తు నీ కళ్ళ ముందున్నది. దీని మూలము మాత్రము తెలియదు, ఎందుకంటే కార్యకారణములను తద్వారా ఏర్పడిన

ఫలరూపముల క్రమమును మనము విశ్లేషిస్తూ ఎంత లోతుగా వెళ్ళినప్పటికినీ అది అనంతము. ఏ ఉత్కృష్టమైన కారణము ఉద్భవించుటకు దాని మూలములో మరొక కారణం కనబడలేదో అక్కడ మనము ఆగవలసి ఉన్నది. ఇదే కాకుండా మనము ఆలోచించవలసిన విషయము మరొకటి ఉన్నది, అది ఈ విశ్వము అనంతముగా వ్యాపిస్తూనే ఉన్నది. ఈ రెండింటికి అదనముగా మరొక అంశము చేరింది, అదేమిటంటే తర్కము (శాస్త్రీయత) నకు అందని విధంగా జరుగుతున్న అద్భుతములు (మహిమలు).]

**విభూతే ర్నోహ్య మస్త్యేవ, యదాకాశస్య హి కారణమ్ |**
**నిరాకాశతయా నోహ్యం, న హేతౌ ప్రాగ్భవాత్ స్వయమ్**
**||5.4||**

[ఏద్వైతే అనూహ్యామై ఉన్నదో, అదే జగత్తులో జరిగే అన్ని అద్భుత మహిమలకు మూలకారణమై ఉండి, తన అస్తిత్వమునకు మరో మూలకారణము లేని ప్రాథమిక వస్తువు తానే అయి ఉన్నది. అనూహ్యము అనగా ఆకాశము (ఖాళీ స్థలము) మరియు కాలమునకు అతీతమైనది. కావున అది మానవుల ఊహలకు అందనిది. ఆకాశము (ఖాళీ స్థలము), కాలములకు అందని అనూహ్యమైన ఆ అంశమే ఆ ఆకాశము (ఖాళీ స్థలము), మరియు కాలము యొక్క పుట్టుకకు కారణమైనందున, తన యందు ఆకాశము (ఖాళీ స్థలము) ఇంతకు ముందే లేనిదై ఉండవలెను. కారణమేమిటంటే ఆకాశము (ఖాళీ స్థలము) యొక్క ఉద్భవము (పుట్టుక) నకు ముందే తన మూలకారణ పదార్థము (అనూహ్యమైనది) లోపల అదే ఆకాశము ఉండజాలదు.]

**ఆకాశభావ నోహ్యత్వాత్, ఆకాశాదాది కారణాత్ |**
**హేతౌ కార్యస్య నో సత్త్వాత్, నోహ్య మాద్యాది కారణమ్**
**||5.5||**

[ఆకాశము (ఖాళీ స్థలము) యొక్క పుట్టుకకు కారణభూతమైనదే ఈ విశ్వమునకు మూలమై ఉండవలెను. ఎందుకంటే ఆకాశము ఈ విశ్వములో కెల్ల అత్యంత ప్రాథమికమైన అంశము ఏలననగా, ఆకాశము లేనిదే ఏ వస్తువూ ఉండజాలదు. అద్భుతమహిమలకు కారణభూతమైన అనూహ్య పదార్థము, తనయందు ఆకాశమును కలిగి ఉండదు కావున అది అనూహ్య తత్త్వము. ఆకాశము తన యందు లేని వస్తువు పరిమాణమును కలిగి యుండజాలదు. పరిమాణము లేని వస్తువును మనము ఊహించలేము. సృష్టికి ఆది (ప్రాథమిక) మూలమైన ఆకాశము, తన పుట్టుకకు ముందు, తన పుట్టుకకు మూలకారణమైన అనూహ్య తత్త్వము లోపల ఉండి ఉండజాలదు - ఇలా కొనసాగే తర్కబద్ధమైన శాస్త్రీయ విచారణ క్రమము ఈ సృష్టికి అనూహ్య పదార్థమేదో, అదే ప్రప్రథమ కారణమని నిర్ణయించుచున్నది. ]

**బ్రహ్మాఽస్తి జగదావృత్య, నోహ్యం నోహ్యైః క్వచిత్ గతమ్ |**
**ఊహానంత్యా జ్జగన్నాంతం, నానంతం స్వయమావృతమ్**
**||5.6||**

[ఈ సృష్టికి కారణమైన ప్రప్రథమ అనూహ్య కారణము బ్రహ్మము. పరమ విశిష్టమైనది అనగా చాలా గొప్పది అనే శాబ్దిక అర్థము కలది బ్రహ్మము (**బృహి = వృద్ధౌ**). అటువంటి బ్రహ్మము ఈ సృష్టిని ఆవరించి ఉండును (సర్వమావృత్య తిష్ఠతి - గీత). ఆవరించుట యనగా ఒక వృత్తమును మరొక పెద్ద వృత్తము ఆవరించుట గా తీసుకొనరాదు. అట్లు తీసుకొన్నచో ఆకాశమునకు బ్రహ్మము లొంగి ఉండవలెను. ఇచ్చట విశ్వపరిధిని దాటినచో ఎచ్చటనైననూ బ్రహ్మము ఉన్నది అనియే అర్థము. బ్రహ్మము అనూహ్యమైనది మరియు పరమ విశిష్టమైనది కావున ఎవ్వరూ తమ మేధాశక్తిని ఉపయోగించి బ్రహ్మమును ఊహలలో కూడ తాకలేరు, అంతేకాదు, ఊహలలో సైతము తనను చేరలేరు. అనూహ్య తత్త్వము గల బ్రహ్మమును తాకలేని విధముగా ఈ సృష్టి నిరంతరము ఊహలకు

మించి వ్యాపించును. మన ఊహలు అనంతమైనందున సృష్టి వ్యాకోచము కూడా అనంతమై అనూహ్య పరబ్రహ్మమును ఎప్పటికీ చిక్కనీయదు. ఈ సృష్టి తనంతట తాను పరిమితమైన పరిధి గలది, కావుననే అనూహ్య పరబ్రహ్మముచే చుట్టూరా ఆవరించబడి ఉన్నది. కాని అనంతంగా వ్యాపించే మన ఊహలు సృష్టి పరిధిని దాటి అనూహ్య పరబ్రహ్మమును చేరలేని, తాకలేని విధమైన ఏర్పాటు కోసము పరిమిత సృష్టి, నిరంతరము వ్యాకోచిస్తున్నది.]

**ఏక సంఘే పరం బ్రహ్మ, తద్బ్రహ్మణి బహూని హి |**
**బహు బ్రహ్మ పరం నోహ్యం, పరబ్రహ్మేతి శంకరః ||5.7||**

[ఏదేని ఒక వర్గమునందు విశిష్టమైన గొప్ప పదార్థము బ్రహ్మము అనబడుతుంది. సృష్టించబడిన అంశములలో విభిన్న వర్గములున్నందున ఆయా వర్గములలో విశిష్టమైనవన్నీ బ్రహ్మము లగును. ఉదాహరణకు ఆధ్యాత్మిక గ్రంథములు అన్నింటిలోకెల్లా 'వేదము' బ్రహ్మము. శాకాహారములన్నింటిలో 'అన్నము' బ్రహ్మము. 'బ్రహ్మము' (పరమాత్మ) విశిష్టములైన సృష్టిలోని అన్ని బ్రహ్మములలోకెల్లా ఉత్కృష్టమైనది. ఈ గందరగోళమును అధిగమించడానికి వివిధ బ్రహ్మములందు పరమోత్కృష్టమైన బ్రహ్మము 'పరబ్రహ్మము' అని చెప్పబడినది. పరబ్రహ్మము అను శబ్దము ఆదిశంకరాచార్యుల చేత ప్రయోగించ బడినది. (**మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ** ..) - దక్షిణామూర్తి స్తోత్రము.]

**సర్వత్ర నో పరబ్రహ్మ, బ్రహ్మార్థో గీయతే శ్రుతిః |**
**బ్రహ్మేతి గృహ్యతామర్థః, తస్మాత్ప్రకరణాన్వయాత్ ||5.8||**

[పరమోత్కృష్టమైన అనూహ్య కారణతత్త్వమును సంబోధించు సందర్భములలో బ్రహ్మము స్థానములో పరబ్రహ్మము అని ప్రయోగించవలెనని గుర్తుంచుకొనవలెను. కొన్నిసార్లు

సృష్టించబడిన, ఊహించదగిన విభిన్నములైన అంశములున్నందున ఆయా వర్గములలో విశిష్టమైనవన్నీ బ్రహ్మము అని గుర్తింప బడెను కదా, ఇట్టి బ్రహ్మముల సందర్భములలో పరబ్రహ్మము అని ప్రయోగించరాదు. ఉదాహరణకు భగవద్గీతలో వేదము, బ్రహ్మముగా సంబోధించబడినది. (**బ్రహ్మాక్షర సముద్భవమ్**). కావున బ్రహ్మము అను శబ్దమును పరబ్రహ్మముగా ప్రయోగించరాదు. ఔచిత్యమును బట్టి మాత్రమే ఆయా అంశములను బ్రహ్మముగా నిర్ణయించవలెను. ]

**జీవధ్యాన పరంబ్రహ్మ, ససర్జ తైజసాకృతిమ్ |**
**తత్కైవల్యేన దత్తోఽభూత్, స ఏవేశ్వర ఉచ్యతే ||5.9||**

[పరబ్రహ్మమును ఏ జీవాత్మ కూడా కనీసము ఊహించజాలదు. కావున ఊహలకందని అంతటి పరబ్రహ్మము అయిన అనూహ్య పరమాత్మను ధ్యానించుట అసాధ్యము. అనూహ్య పరమాత్మ ఈ పరిస్థితిని సృష్టికి ముందే ఊహించి పరమవ్యోమమును సృష్టించెను. ఇది కంటికి కనిపించని ఒక సూక్ష్మజడశక్తి రూపమైన కొద్ది ఆకాశము (ఖాళీ స్థలము). దీనితో పాటు కనిపించగల స్థూల జడశక్తిని కూడా మొట్టమొదట సృష్టించెను. ఆ స్థూల శక్తిని ఉపయోగించి ప్రప్రథమముగా ఒక తేజో రూప శరీరముతో గల, అనగా తేజోరూపాత్మ సృష్టించబడెను. ఈ నియమిత శక్తిమంతమైన తేజోరూపమే 'దత్తుడు'. దత్తుని తేజోరూపశరీరము కొద్ది పరిమాణము గల పరమవ్యోమము నందు ఉంచ బడెను. పరమవ్యోమము నందున్న ఈ నియమిత శక్తివంతమైన తేజో రూపమైన ఆత్మతో మరియు తేజోరూపదత్త శరీరముతో అనూహ్య పరబ్రహ్మము సంపూర్ణముగా విలీనమయ్యెను కావున ఇంతటి తేజోరూపాత్మక శరీరముతో గూడిన జీవాత్మ పరబ్రహ్మ విలీనానంతరము 'ఈశ్వరుడు' లేదా 'దత్తపరబ్రహ్మము' గా గుర్తింప బడెను. ఇదియే భవిష్యత్తులో

సృష్టించబోయే ప్రపంచములోని ఆత్మలకు ధ్యానించుటకు, ఆరాధించుటకు సాధ్యమయ్యే విధముగా దత్తమైన అనూహ్య పరబ్రహ్మము యొక్క మొదటి తేజోరూపము.]

**స దత్త స్సృష్టి మకరోత్, య స్త్రినామా త్రికర్మభిః |**
**స త్రిమూర్త్యవతారోఽభూత్, పరబ్రహ్మైవ సోపధిః ||5.10||**

[ఇట్టి మొట్టమొదటి తేజోరూపావతారము (శరీరము మరియు ఆత్మతో నిర్మితమైనది), ఈశ్వరుడు లేదా దత్త పరబ్రహ్మముగా గుర్తింప బడెను. ఇలా మొట్టమొదట తేజోరూపముతో సంపూర్ణముగా విలీనమైన అనూహ్య పరబ్రహ్మమే స్వయంగా మొట్టమొదటి **తేజో రూపావతారమైన దత్త పరబ్రహ్మము**గా గుర్తింపబడి, (భవిష్యత్తులో సృజించగల) సమస్తవిశ్వమును సృష్టించే 'హిరణ్యగర్భుడు' అని, నడిపించే 'నారాయణుడు' అని, లయంచేసే 'ఈశ్వరుడు' అని కీర్తించబడెను. ఆ తరువాత దత్త భగవానుడు త్రిమూర్తులనబడు బ్రహ్మ, విష్ణు, శివ అనే మూడు తేజోరూపావతారములుగా వచ్చెను. దత్త భగవానుడు ఆవిర్భవించిన తర్వాత పరబ్రహ్మము మరే మాధ్యమము (రూపము) తోను ప్రత్యక్షంగా విలీనము చెందలేదు. ఇతర దేవీ దేవతల రూపాలలో భగవంతుడు అవతరించు సందర్భములు అన్నింటిలోనూ **దత్త భగవానుడు లేదా ఈశ్వరుడు ఆయా మాధ్యమములతో విలీనమయ్యెను**. కావున దత్త భగవానుడే తేజోరూపమైన (తేజః శరీరము, తేజోరూపాత్మ) మాధ్యమములో మొదట ప్రకటితమైన పరబ్రహ్మము.]

**సృష్ట్వా నరమావిశచ్చ, ద్రవ్యం వపుషి చాధికమ్ |**
**అవతారా సమే దత్తాత్, జడశక్తి శ్చిదాకృతిః ||5.11||**

[సృష్టికార్యములో విశ్వమును సృష్టించిన తర్వాత పదార్థస్వరూపమైన శరీరములతో ఆత్మలుగా పిలువబడు

మానవులను ఇతర ప్రాణులను సృష్టించెను. మానవులలో తాను నిర్ణయించిన కొందరు భక్తులందు దత్త భగవానుడు విలీనమై నరావతారమయ్యేను. మానవశరీరము జడపదార్థము మరియు జడశక్తులతో ఏర్పడగా తేజః శరీరము తేజః శక్తితో ఏర్పడెను. ఒక తేజఃశరీరములో ఉన్నా లేదా మానవ శరీరములో ఉన్నా ఆత్మ చైతన్యముతో ఏర్పడినదే. క్రియాశీలకమైన మెదడులోని నాడీమండలములో విశేషముగా పనిచేస్తున్న జడశక్తియే చైతన్యము. కావున మానవరూపములో ఉన్నదైనా లేక తేజోరూపములో ఉన్నదైనా అవతారములన్నింటిలో (విలీనమై) ఉన్నది దత్తభగవానుడొక్కడే.]

**జీవశ్చిదేవ చిన్మూలం, జడశక్త్యామిహాత్మవాక్ |**
**వాసనావ్రాతజీవార్తో, జగతోంఽశో న తస్య హి ||5.12||**

[ఎల్లప్పుడు జడశక్తి యొక్క విశేషరూపమైన చైతన్యమునే ఆత్మ అందురు. ఆత్మ అనేది ఊహించదగిన సృష్టిలో భాగమైన, ఊహించదగిన అంశమే తప్ప ఊహింప సాధ్యము కాని అనూహ్యమైన సృష్టికర్త కాదు. చైతన్యముగా రూపాంతరము చెందిన జడశక్తినే ఆత్మ అని కాని ఒక జీవుడు అని కాని వివరించదగును. ఒక్కొక్క జీవాత్మ కొన్ని ఆలోచనల సమూహము. ఆలోచన అనగా చైతన్యము యొక్క ప్రకటితరూపము. కావున మనము ఒక జీవాత్మను నేరుగా చైతన్యపు భాగముగా గుర్తింపవచ్చును. ఏ జీవాత్మ అయినా సృష్టిలో ఒక భాగమే తప్ప సృష్టికర్తలో భాగము కాదు. కావున ఏ ఒక్క జీవాత్మ అయినా తాను సృష్టికర్త అనడములో అర్థం లేదు.]

**జడశక్త్య ఉపరిచ్ఛిన్న- జగత్కారణ భాషణాత్ |**
**స ఆత్మ స్రష్టృవత్ భ్రాంతః, కారణం పరమం న హి||5.13||**

[ఆత్మ జడశక్తి యొక్క ఖండరూపము, అదే జడశక్తి ఈ సమస్త సృష్టిలోని జడాజడపదార్థముల మూలకారణమైనందున, జడశక్తి అనంతమైన పరిమాణమైనపుడు అదియే పరబ్రహ్మమని, పరిమిత జడశక్తి ఆత్మ అని భ్రమపడి, ఆత్మనే పరబ్రహ్మము అని పొరబడుతున్నారు. ఇక్కడ అపరిమితమైన జడశక్తి కారణంగానే సృష్టిలో భౌతికపరిమాణములు ఏర్పడుతున్నాయని **మేము** ఒప్పుకున్నప్పటికినీ ఆ మూలకారణజడశక్తిని సృష్టించినది పరబ్రహ్మమే. కావున అపరిమితమైన జడశక్తి 'సృష్టి'కి మూలకారణము కాలేదు. పరబ్రహ్మమొక్కటియే ఈ మొత్తము సృష్టికి కర్త.]

**ఆత్మా తేజ శ్రుత స్సృష్టం, బహు సామ్య విశేషణైః |**
**స్రష్టు సృష్టి విభేదోఽత్ర, స్వావతార సుబోధకః ||5.14||**

[పవిత్ర గ్రంథములందు సృష్టికి మూలకారణము ఆత్మ అని చెప్పబడినది. పరబ్రహ్మమును సూచించే శబ్దవిశేషములన్నీ ఆత్మ కొరకు ఉపయోగించ బడినాయి. కాబట్టి ఆత్మయే పరబ్రహ్మమని పొరబడటము పరిపాటి అయినది. ఈ పొరపాటుకు ముఖ్యకారణము జడశక్తికి మరియు పరబ్రహ్మమునకు గల విశేషణశబ్దములు ఉమ్మడిగా వాడబడుతున్నాయి. కాని యథార్థమునకు ఈ రెండింటి మధ్య తేడా ఏమిటంటే జడశక్తి పరబ్రహ్మముచే సృష్టించబడిన (**తత్ తేజో ఽసృజత**.. - వేదము) అంశము. ఆత్మ అనగా అనూహ్య పరబ్రహ్మము విలీనమైన మానవ శరీరి లేదా తేజోరూప శరీరి. ఈ సందర్భములో మాత్రమే పరబ్రహ్మము యొక్క శబ్దవిశేషణములన్నీ ఆ మానవ / తేజః శరీరము లోని ఆత్మకు వర్తిస్తాయి.]

**జగ చ్చిదాచిదర్థాంగం, చిదచిత్వలమంతిమమ్ |**
**జీవాత్మా న స్వతంత్రో హి, స స్రష్టా యది హాస్యవాక్ ||5.15||**

[సృష్టి అంతయూ జడ పదార్థము మరియు చైతన్యముల చేతనే ఏర్పడినది. చైతన్యము, జడపదార్థ సృష్టిక్రమము చిట్టచివర ఏర్పడినది (**అన్నాత్ పురుషః**..). ఆత్మ లేదా జీవాత్మ అనునది పదార్థశరీరము (పంచభూతములతో ఏర్పడిన మానవశరీరము) గాని లేదా తేజోరూప శరీరము (తేజస్సును మాత్రమే శరీరముగాగలది) గాని మాధ్యమముగా కలిగి, జడశక్తి నుండి విశేషరూపముగా ఉత్పన్నమైనదే తప్ప తనంతట తానుగా, స్వతంత్రముగా అస్తిత్వము లేనిది. ఎవరైనా ఆత్మ కాని జీవాత్మ కాని సృష్టికర్త అని ప్రవచిస్తే అది హాస్యాస్పదమైన వచనము.]

**అత్ర కైవల్య మోక్షౌ హి, సత్యౌ మృత్యోః పరం తథా |**
**యథా జీవిత మోక్షస్తు, జగద్బంధ విమోచనమ్ ||5.16||**

[జీవించి ఉన్నపుడు ముక్తి మరియు కైవల్యము పొందు విధానము గురించి నీవు అడిగినావు. ఇది సరైన ప్రశ్న, ఎందుకంటే మరణించిన తర్వాత ఏ కొత్త మార్పు సాధ్యము కాదు. జీవుడు ఇక్కడ జీవించి ఉండగా సాధించిన స్థితి ఏదో అదే మృత్యువు తర్వాత కూడా కొనసాగుతుంది. ఒకవేళ నీవు జీవించి ఉండగా నరావతారమును పొందగలిగితే, మరణానంతరము ఊర్ధ్వ లోకాలలో తేజోరూప అవతారమును పొందగలవు. ముక్తి అనగా ప్రాపంచిక బంధాల నుండి విడుదల కావటము కాని ప్రపంచము నుండి కాదు.]

**లోకబంధచ్యుతి ర్యత్నాత్, నిష్ఫలా మూఢ పద్ధతిః |**
**అయత్నా ద్భగవద్బంధాత్, సుధా క్షీరవ దీక్ష్యతామ్ ||5.17||**

[ప్రాపంచిక బంధాల నుండి విడుదల మాత్రమే పొందరాదు, ఎందుకంటే అట్టి విడుదల తాత్కాలికము మరియు మూర్ఖమైనది. ముక్తి అనేది భగవంతునితో ఏర్పడిన బలమైన

బంధము కారణముగా ప్రాపంచిక బంధాల నుండి సహజముగా పొందిన విడుదల. ప్రాపంచిక బంధాలు నీ ప్రమేయము లేకుండా వాటంతట అవే దూరమవ్వాలి తప్ప నీవు ప్రయత్నపూర్వకంగా తెగతెంపులు చేసుకోవడం కాదు. 'అమృతము రుచి చూసిన తర్వాత సహజంగా పాలు తాగలేని స్థితి' లాంటిదే ప్రాపంచిక బంధముల నండి పొందిన ముక్తి.]

**కైవల్యమేకీకరణం, అవతారే హి విద్యతే |**
**భక్తానా మపి సాయుజ్యం, యత్ర దేవో హి సేవకః ||5.18||**

[కైవల్యము లేదా అద్వైత యోగము అనగా ఒక అంశము సంపూర్ణముగా మరొక అంశముతో విలీనము కావటము. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ, లోకములో నరావతారముగా భగవంతుడు రావటము లేదా ఊర్ధ్వ లోకాలలో తేజోరూపములో భగవంతుడు విలీనమగుట. ఇదే విషయము భక్తుల వైపు నుండి చూస్తే అది **సాయుజ్యము.** అనగా భగవంతునికి అత్యంత సమీపములో ఉండటము. ఇది కైవల్యము కంటే శక్తివంతమైనది. ఎందుకంటే ఇటువంటి ద్వైత భక్తి నందు భగవంతుడు భక్తునికి సేవకుడిగా వ్యవహరిస్తాడు. అదే కైవల్యములో నైతే భగవంతుడు భక్తునితో సమానమై తనలో సంపూర్ణముగా విలీనమగుచున్నాడు.]

**కైవల్యమపి సాయుజ్యం, సామీప్యం త్రిగురుశ్రితం |**
**ద్వయో స్సాలోక్య సారూప్యే, పరో జీవ స్త్రయచ్యుతః ||5.19||**

['కైవల్యము' అను అద్వైత సిద్ధాంతమునకు ఆదిశంకరులు కర్త. 'విశిష్టాద్వైతము' అనబడు సాయుజ్యమును రామానుజులు సిద్ధాంతీకరించారు. విధేయుడైన బంటు వలె సన్నిహితముగా నిలబడటము లేదా సామీప్యము అనునది మధ్వ సిద్ధాంతము. రామానుజుల సాయుజ్యము , మధ్వుల సామీప్యము లలో సాలోక్యము (ఒకే లోకములో ఉండటము) మరియు సారూప్యము

(ఒకే రూపము) ఉంటాయి. అయితే సాధారణ మానవునికి ఇంతటి దివ్య ఫలములైన సాయుజ్యము, సామీప్యము, కైవల్యములు సంభవించవు. ]

**విద్యుద్వల్లీవ వల్లీవ, విద్యుదావేశ వర్జితా |**
**వల్లీవ స్థగితా తస్యై, మార్గ వల్లీవ జీవినః ||5.20||**

[ఆదిశంకరుల ఆత్మ విద్యుదీకరణము చెందిన తీగ వంటిది. రామానుజుల ఆత్మ విద్యుత్ ప్రవాహము ఆపబడిన తీగ వంటిది. మధ్వుల ఆత్మ ఎలాంటిదంటే, ప్రధాన విద్యుత్తుశక్తి మూలము నుండి అనుసంధానము చేయకముందు కొత్తగా కట్టిన ఇంటిలోని గదులన్నింటిలో అమర్చిన విద్యుత్ తీగల వంటిది. ఇక సాధారణ మానవుల ఆత్మ ఎలాంటిది అంటే అవసరము లేని ఒక తీగ ముక్కను అందరూ నడిచే దారిలో విసిరి వేయబడినటువంటిది. ]

**ఇతి త్రైలోక్యగీతాయాం 'బ్రహ్మాదివిచారయోగో' నామ పంచమాధ్యాయః**

**ఈ విధంగా త్రైలోక్యగీత యందు ఐదవ అధ్యాయము అయిన 'బ్రహ్మము మొదలగు వాటిని గురించి విచారణ యోగము' పరిసమాప్తము.**